



భారత త్రివిధ దళాలు గురువారం ఉదయం ముప్పేట దాడులతో పాకిస్థాన్‌లోని లాహోర్ సహా 12 నగరాల్లోని గగనతల రక్షణ వ్యవస్థను తుత్తినియలు చేసింది. ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ నాశనమైన నగరాల జాబితాలో లాహోర్, కరాచీ, రావల్పిండి తదితర నగరాలు ఉన్నాయి.

## 'సుదర్శన చక్ర' ప్రత్యేకతలు ఇవే..




# భారత్‌కు రక్షణ.. 'సుదర్శన చక్ర'!

- ప్రపంచంలోనే ఆధునిక క్షిపణి నాశక వ్యవస్థల్లో ఒకటిగా గుర్తింపు
- యుద్ధ విమానాలు, జెట్లు, డ్రోన్లు, క్షిపణుల కూల్చివేత క్షణాల్లోనే..
- పాక్ దాడులను తిప్పికొట్టేందుకు 24 గంటల కిందటే సేవలు షురూ
- తొలిసారిగా వినియోగంలోకి తీసుకొచ్చినా.. పవర్‌ఫుల్ ఫలితాలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): భారత్‌లోని 15 కీలక నగరాలపై దాడులు చేయడానికి పాకిస్థాన్ ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణులనే కాకుండా గురువారం రాత్రి జమ్ము, పంజాబ్, రాజస్థాన్‌లోని కీలక స్థావరాలపై పాక్ పంపించిన ఆత్మాహుతి డ్రోన్లు, యుద్ధవిమానాలను రష్యాకు చెందిన ఎస్-400 సిస్టమ్స్ అలియాస్ సుదర్శన చక్ర ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ నాశనం చేసింది. దీంతో ఏమిటీ ఈ వ్యవస్థ? ఎలా పనిచేస్తుంది అన్నదానిపై అంతటా ఆసక్తి నెలకొన్నది.

### ఏమిటీ సుదర్శన చక్ర?

400 కిలోమీటర్ల దూరంలో ఉండగానే శత్రు దేశాలకు చెందిన స్టెల్త్ ఎయిర్‌క్రాఫ్ట్, ఫైటర్ జెట్లు, డ్రోన్లు, క్రూయిజ్, బాలిస్టిక్ క్షిపణులను నాశనం చేయగల ఎస్-400 ఎయిర్ డిఫెన్స్ మిసైల్ సిస్టమ్‌ను సుదర్శన చక్రగా భారత ఎయిర్‌ఫోర్స్ పిలుస్తున్నది. ప్రపంచంలోనే అత్యాధునిక క్షిపణి నాశక వ్యవస్థల్లో ఒకటిగా దీనికి గుర్తింపు ఉంది. 600 కిలోమీటర్ల దూరంలో ఉండగానే శత్రు సేనల డ్రోన్లు, క్షిపణులు, యుద్ధ విమానాలను గుర్తించి ట్రాక్ చేసే సామర్థ్యం ఈ వ్యవస్థకు కలదు.

### ఎందుకు ఆ పేరు?

పురాణాల్లో విష్ణుమూర్తి ఆయుధమైన సుదర్శన చక్రం 360 డిగ్రీల కోణంలో తిరుగుతుంది. ఎస్-400 ఎయిర్ డిఫెన్స్ మిసైల్ సిస్టమ్ కూడా 360 డిగ్రీల కోణంలో శత్రు సేనల డ్రోన్లు, క్షిపణులను గుర్తించి నాశనం చేయగల సామర్థ్యం కలదు. అందుకే దీనికి 'సుదర్శన చక్ర'గా నామకరణం చేశారు.

### మన దగ్గర ఎన్ని ఉన్నాయి?

ఎస్-400 శ్రేణికి చెందిన ఐదు రక్షణ వ్యవస్థలను కొనుగోలు చేయడానికి భారత్ 2018లో రష్యాతో ఒప్పందం చేసుకొన్నది. ఇప్పటికే మూడు ఎస్-400 స్క్వాడ్రన్లు అందుబాటులోకి రాగా మరో రెండు వచ్చే ఏడాది అందుబాటులోకి రానున్నాయి. మూడింటి కోసం భారత్ రూ. 30 వేల కోట్లు వెచ్చించింది. పాక్ దాడులను తిప్పికొట్టడానికి 24 గంటల కిందటే భారత ఎయిర్‌ఫోర్స్ 'సుదర్శన చక్ర' సేవలను వినియోగించుకోవడం విశేషం.



డ్రోన్ దాడిలో దెబ్బతిన్న రావల్పిండిలోని క్రికెట్ స్టేడియం

# రావల్పిండి స్టేడియంపై డ్రోన్ దాడి

**పీఎస్‌ఎల్ మ్యాచ్‌కు గంటల ముందే ఘటన • దెబ్బతిన్న స్టేడియం.. మ్యాచ్ వాయిదా**

ఢిల్లీ, మే 8: ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో దాయాదుల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి పాక్‌లోని ఉగ్ర స్థావరాలపై దాడి జరగగా.. తాజాగా రావల్పిండి క్రికెట్ స్టేడియంపై డ్రోన్ దాడి జరిగింది. ఈ దాడిలో స్టేడియంలోని కొంత భాగం దెబ్బతిన్నది. పీఎస్‌ఎల్‌లో భాగంగా గురువారం రాత్రి 8 గంటలకు ఈ స్టేడియంలో మ్యాచ్ జరగాల్సి ఉండగా.. కొన్ని గంటల ముందుగా ఈ దాడి జరిగింది. దీంతో పెషావర్ జల్మీ వర్సెస్ కరాచీ కింగ్స్ మధ్య జరగాల్సిన మ్యాచ్‌ను వాయిదా వేశారు. భారత్‌లోని 15 మిలిటరీ స్థావరాలపై పాక్ దాడులు చేసేందుకు ప్రయత్నించడంతో ప్రతిస్పందనగా ఈ దాడి జరిగినట్టు తెలుస్తున్నది. లాహోర్‌లోని ఎయిర్ డిఫెన్స్ రాడార్ సిస్టమ్‌ను భారత్ ధ్వంసం చేసింది. లాహోర్, గుజ్రాన్‌వాలా, చక్వాల్, బహవల్‌పూర్, మియానో, కరాచీ, ఛోర్, రావల్పిండి, అటక్ తదితర ప్రాంతాల్లో డ్రోన్ దాడులు జరిగిగాయని, వాటిలో కొన్ని డ్రోన్లను కూల్చివేసినట్టు పాక్ ఆర్మీ అధికార ప్రతినిధి లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌద్రీ ధ్రువీకరించారు.

## • సంఘీభావ ర్యాలీ




ఉగ్రవాదంపై భారత సైన్యం చేస్తున్న దాడులకు మద్దతుగా గురువారం బీఆర్‌ఎస్ చేపట్టిన ర్యాలీలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు జాతీయ జెండా పట్టుకొని పాల్గొన్నారు. ఉగ్రవాదాన్ని సమూలంగా తుదముట్టించేందుకు భారతసైన్యానికి దేశ ప్రజలంతా అండగా నిలవాలని కోరారు.

– వర్ధన్నపేట

# దద్దరిల్లిన లాహోర్

▸ మొదటిపేజీ తరువాయి...

తెగబడింది. అయితే, ఇది గుర్తించిన భారత సైన్యం రష్యాకు చెందిన ఎస్-400 సిస్టమ్స్ అలియాస్ సుదర్శన చక్ర ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌తో పాక్ డ్రోన్లు, క్షిపణులను కూల్చేసింది. అయితే, భవిష్యత్తులో కూడా పాక్ ఇలాంటి దాడులకు తెగబడొచ్చన్న కారణంతో పాక్ సైన్యానికి కీలకంగా ఉన్న లాహోర్‌తో పాటు మరో 12 ప్రాంతాల్లోని ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌లను ధ్వంసం చేయాలని భారత సైన్యం ఈ సందర్భంగా నిర్ణయించింది. ఇందులో భాగంగా గురువారం ఉదయం తొలుత లాహోర్ అనంతరం మరో 12 ప్రాంతాల్లో భారత సైన్యం అత్యాధునిక హరోప్ డ్రోన్లు, శక్తిమంతమైన క్షిపణులతో నిరంతరాయ దాడులు జరిపింది.



లాహోర్ ఎయిర్ సెక్యూరిటీ వ్యవస్థపై భారత్ జరిపిన దాడి

### ఫొటోలు రాగానే ఎటాక్

హెచ్‌క్యూ-9, 16 ఎయిర్ డిఫెన్స్ సెక్యూరిటీ వ్యవస్థకు సంబంధించిన బ్యాటరీ వ్యవస్థ ఫొటోలు ఎప్పుడైతే చేతికి చిక్కాయో.. ఆ వెంటనే ఇజ్రాయెల్‌కు చెందిన ప్రత్యేకమైన హరోప్ డ్రోన్లు, శక్తిమంతమైన క్షిపణులతో భారత సేనలు దాడులను మొదలుపెట్టాయి. అలా సెకండ్ల వ్యవధిలో ఆ బ్యాటరీ సిస్టమ్‌ను ధ్వంసం చేసింది. దీంతో హెచ్‌క్యూ-9, 16 ఎయిర్ డిఫెన్స్ సెక్యూరిటీ వ్యవస్థకు అవసరమైన సిగ్నలింగ్ దాదాపుగా నిలిచిపోయింది. ఆ వెంటనే పెద్దయెత్తున దాడులను ఉద్ధృతం చేసిన భారత సైన్యం అలా మొత్తంగా లాహోర్ గగనతల రక్షణ వ్యవస్థను భస్మీపటలం చేసేసింది.

### లాహోర్ ఆగమాగం

గురువారం ఉదయం లాహోర్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను భారత సేనలు డ్రోన్లు, క్షిపణులతో ఎప్పుడైతే తుత్తినియలు చేశాయో.. నగరం అంతటా భారీ శబ్దంతో సైరన్లు మోగడం ప్రారంభించాయి. దీంతో భయాందోళనలకు గురైన ప్రజలు వీధుల్లో పరుగులు తీస్తూ కనిపించారు. డిఫెన్స్ సిస్టమ్‌ను కూల్చేసే క్రమంలో కొన్ని శకలాలు స్థానికంగా ఉన్న వాల్టన్ ఎయిర్‌పోర్ట్, లాహోర్ సెంట్రల్, లాహోర్ ఆర్మీ కంటోన్మెంట్ ప్రాంతంలో పడినట్టు అంతర్జాతీయ పత్రికల్లో కథనాలు వెలువడ్డాయి. ఈ క్రమంలో కొన్ని చోట్ల పేలుళ్ల శబ్దం వినిపించినట్టు పేర్కొన్నాయి. దట్టమైన పొగ అలుముకున్న చిత్రాలు, వీడియోలు వైరల్‌గా మారాయి. దీంతో లాహోర్ ఎయిర్‌పోర్ట్‌ను తాత్కాలికంగా మూసివేశారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో లాహోర్‌లోని తమ పౌరులు, దౌత్యవేత్తలు, యాత్రికులు ఎయిర్‌పోర్ట్, కంటోన్మెంట్ ఏరియాల నుంచి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాల్సిందిగా అమెరికా అడ్వైజరీ జారీ చేసింది.

### ఆపరేషన్ స్ట్రాటజీ ఇలా..

లాహోర్ భద్రతను పర్యవేక్షించడంలో భాగంగా హెచ్‌క్యూ-9, 16 ఎయిర్ డిఫెన్స్ సెక్యూరిటీ వ్యవస్థను 2017లో చైనా నుంచి పాక్ ఆర్మీ కొనుగోలు చేసింది. దీనికోసం రూ. 1,872 కోట్లు (పాక్ కరెన్సీ) వెచ్చించింది. 40 కిలోమీటర్ల నుంచి 125 కిలోమీటర్ల పరిధుల్లోని ఎయిర్‌క్రాఫ్ట్, క్రూయిజ్ క్షిపణులు, యూఏవీలు, చిన్న, మధ్య స్థాయి బాలిస్టిక్ క్షిపణులను గుర్తించడంతో పాటు వాటిని పేల్చగల సామర్థ్యం ఈ వ్యవస్థ సొంతం. ఇది తెలిసిన భారత ఆర్మీ ఎంతో చాకచక్యంగా వ్యవహరించింది. చైనాకు చెందిన హెచ్‌క్యూ-9, 16 ఎయిర్ డిఫెన్స్ సెక్యూరిటీ వ్యవస్థను నాశనం చేయాలంటే ముందుగా దాని బ్యాటరీ వ్యవస్థను నిర్వీర్యం చేయాలని తెలుసుకొన్నది. ఈ క్రమంలోనే సప్రెషన్ ఆఫ్ ఎనిమీ ఎయిర్ డిఫెన్సెస్ (సీడ్) ఆపరేషన్‌ను మొదలుపెట్టింది. ఇందులో భాగంగా తొలుత బ్యాటరీ వ్యవస్థను గుర్తించడానికి రాడార్‌ను తప్పుదోవ పట్టించే ప్రత్యేక డ్రోన్లను ప్రయోగించి లైవ్ ఫొటోలను తెప్పించుకొన్నట్టు రక్షణ రంగ నిపుణులు తెలిపారు.


### డజను నగరాల ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ నాశనం

'ఆపరేషన్ సిందూర్'కు కొనసాగింపుగా భారత త్రివిధ దళాలు గురువారం ఉదయం ముప్పేట దాడులతో పాకిస్థాన్‌లోని లాహోర్ సహా 12 నగరాల్లోని గగనతల రక్షణ వ్యవస్థను తుత్తినియలు చేసింది. ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ నాశనమైన నగరాల జాబితాలో లాహోర్, కరాచీ, రావల్పిండి, సియాల్‌కోట్, ఇస్లామాబాద్, గుజ్రాన్‌వాలా, చక్వాల్, బహావల్పూర్, మియానో, ఛోర్, అట్టోక్ మరో ప్రాంతం ఉన్నట్టు మీడియాలో కథనాలు వెలువడ్డాయి.

# చిమ్మచీకట్లో చీల్చి చెండాడుతూ...

▸ మొదటిపేజీ తరువాయి...

భారతాన్ని లక్ష్యంగా చేసుకున్న పాక్ ఆ వైపు సరిహద్దు వెంట ఒకేసారి భారీ సంఖ్యలో డ్రోన్లను, క్షిపణులను ప్రయోగించింది. పంజాబ్‌లోని ఉదంపూర్, పఠాన్‌కోట్, ఎయిర్‌బేస్‌లు, రాజస్థాన్‌లోని జైసల్మేర్, గుజరాత్‌లోని సర్‌క్రీక్ వద్ద దాడికి వచ్చిన డ్రోన్లను భారత దళాలు కూల్చివేశాయి. జమ్ములోనే ఎనిమిది డ్రోన్లను కూల్చివేశాయి. వాటి రాకను రాడార్ వ్యవస్థ ముందే పసిగట్టడంతో అప్రమత్తమైన ఎస్-400 రక్షణ వ్యవస్థ డ్రోన్లను, క్షిపణులను మధ్యలోనే అడ్డుకొని ఆకాశంలోనే ధ్వంసం చేసింది. పాక్ కవ్వింపుతో జమ్ము, కుప్వారా, చండీగఢ్, మొహాలీ నగరాల్లో ఎమర్జెన్సీ సైరన్లు మోగాయి.



భారత్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ ధాటికి ఆకాశంలో పేలుతున్న పాక్ క్షిపణులు

### మూడు యుద్ధ విమానాల కూల్చివేత

భారత సాయుధ దళాలు జమ్ముపై దాడికి వచ్చిన పాకిస్థాన్‌కు చెందిన మూడు ఫైటర్‌జెట్ విమానాలను కూల్చివేశాయి. వీటిలో ఒకటి అమెరికా తయారీ ఎఫ్-16 కాగా, రెండు జేఎఫ్-17 విమానాలున్నాయి. ఎఫ్-16 పైలట్ బందీగా చిక్కినట్టు తెలిసింది. జమ్ముకశ్మీర్‌లోని జమ్ము, ఆర్‌ఎస్‌పురా, చనీ హిమత్ వాటి పరిసర ప్రాంతాలలో సైనిక, పౌర నివాసాలు లక్ష్యంగా పాక్ దాడికి ప్రయత్నించింది. అయితే భారత అధునాతన గగనతల రక్షణ వ్యవస్థలు ఎస్-400, ఆకాశ్ వ్యవస్థలు విజయవంతంగా పాక్ మిస్సైళ్లను, డ్రోన్లను ఎదుర్కొని కూల్చివేశాయి. జమ్ముపై దాడికి వచ్చిన 8 డ్రోన్లు లేదా క్షిపణులను కూల్చివేసినట్టు సైనికవర్గాలు ప్రకటించాయి. పాక్‌లోని సర్గోధా నుంచి జమ్ము వైపు వచ్చిన ఎఫ్-16 ఫైటర్ జెట్‌ను కూడా కూల్చివేసినట్టు తెలిపాయి.



# వెంటనే వెనక్కి వచ్చేయండి

**గగన్‌యాన్ వ్యోమగామికి ఐఏఎఫ్ పిలుపు**

న్యూఢిల్లీ, మే 8: ఆపరేషన్ సిందూర్ కారణంగా పాకిస్థాన్‌తో సైనిక ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో భారతదేశ తొలి మానవసహిత అంతరిక్ష యాత్ర గగన్‌యాన్ కోసం ఎంపికైన నలుగురు భారతీయ వైమానిక దళ(ఐఏఎఫ్) అధికారులలో ఒకరైన గ్రూపు కెప్టెన్ అజిత్ కృష్ణన్‌ను వెంటనే తిరిగి రావాలని ఐఏఎఫ్ ఆదేశించింది. ప్రస్తుతం ఢిల్లీలో జరుగుతున్న ప్రపంచ అంతరిక్ష పరిశోధనా సదస్సులో పాల్గొంటున్న కృష్ణన్‌కు వెనక్కి తిరిగి రావాలని ఐఏఎఫ్ నుంచి పిలుపు వచ్చింది. ప్రస్తుత పరిస్థితి ఏమిటో మీకు తెలుసునని ఆయన విలేకరుల వద్ద వ్యాఖ్యానించారు. 2027 ప్రారంభంలో ప్రయోగించనున్న తొలి మానవసహిత అంతరిక్ష యాత్రలో ముగ్గురు వ్యోమగాములను రోదసిలోకి పంపనున్నారు. కృష్ణన్‌తో పాటు సహచర వ్యోమగామి అంగద్ ప్రతాప్ భారత్‌లో శిక్షణ పొందుతున్నారు. ఇతర బృంద సభ్యులు సుభాంశు శుక్లా, ప్రశాంత్ బీ నాయర్ వచ్చే ఆక్జియం -4 మిషన్ కోసం అమెరికాలో శిక్షణ పొందుతున్నారు. 2003లో ఐఏఎఫ్‌లో చేరిన కృష్ణన్ టెస్ట్ పైలట్‌గా, ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా విశేష అనుభవం ఉంది. ఎస్‌యూ-30, మిగ్-29 వంటి యుద్ధ విమానాలు నడపడంలో దాదాపు 2,900 గంటల అనుభవం ఆయనకు ఉంది.



ఎస్ -400 రక్షణ వ్యవస్థ

# సైన్యం దెబ్బకు ముక్కలైన పాక్ డ్రోన్లు, క్షిపణులు

▸ మొదటిపేజీ తరువాయి...

సెకండ్ల వ్యవధిలోనే తునాతునకలయ్యాయి. ఎప్పటికైనా ధర్మానిదే విజయం అని దీంతో మరోమారు రుజువైంది. 'ఆపరేషన్ సిందూర్'తో గట్టి ఎదురుదెబ్బ తగిలిన పాకిస్థాన్.. భారత్‌పై ప్రతీకార చర్యలకు విఫలయత్నం చేసింది. భారత్‌లోని కీలక నగరాల్లో ఉన్న సైనిక స్థావరాలపై బుధవారం అర్ధరాత్రి డ్రోన్లు, క్షిపణులతో దాడులకు యత్నించింది. అయితే, అప్పటికే పూర్తి అప్రమత్తతతో ఉన్న భారత సైన్యం ఆ దాడులను తిప్పికొట్టడమే కాకుండా అత్యాధునిక ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌తో ఆయా డ్రోన్లను, క్షిపణులను సెకండ్ల వ్యవధిలో పేల్చేసింది. దీంతో ఆయా శకలాలు దేశంలోని పలు ప్రాంతాల్లో చెల్లాచెదురుగా పడ్డాయి. ఈ మేరకు పీఐబీ ఒక ప్రకటనలో వెల్లడించింది.

### కుటిల యత్నం ఇలా..

మంగళవారం అర్ధరాత్రి తర్వాత భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో పాక్, పీవోకేలోని తొమ్మిది ఉగ్ర శిబిరాలు నేలమట్టమయ్యాయి. 100 మందికి పైగా ఉగ్రవాదులు హతమయ్యారు. దీంతో ప్రతీకారేచ్ఛతో రగిలిపోయిన పాక్.. ఉత్తర, పశ్చిమ భారత్‌లోని 15 నగరాల్లో ఉన్న సైనిక స్థావరాలను పేల్చేయాలని కుటిల యత్నాలకు తెగబడింది. ఇందులో భాగంగా శ్రీనగర్, జమ్ము, పఠాన్‌కోట్ ఇలా 15 నగరాల్లోని సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకొని డ్రోన్లు, క్షిపణులను ప్రయోగించింది. అయితే, అప్పటికే అప్రమత్తంగా ఉన్న భారత సైన్యం.. తమ వైపునకు దూసుకువస్తున్న పాక్ డ్రోన్లను, క్షిపణులను ఇట్టే గుర్తించాయి. వెంటనే అలర్ట్ అయిన భారత రక్షణ వ్యవస్థ.. పాక్ డ్రోన్లు, క్షిపణులను పేల్చేయడానికి ఇంటిగ్రేటెడ్ యూఏఎస్ గ్రిడ్, రష్యాకు చెందిన ఎస్-400 సిస్టమ్స్ అలియాస్ సుదర్శన చక్ర ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను యాక్టివేట్ చేశాయి. దీంతో సెకండ్ల వ్యవధిలో ఆయా రక్షణ వ్యవస్థలు పాక్‌కు చెందిన డ్రోన్లు, క్షిపణులను పేల్చేశాయి. వాటి శకలాలు పంజాబ్ సహా పలు ప్రాంతాల్లో పడిపోయినట్టు ఆర్మీ వర్గాలు తెలిపాయి.

### శకలాల కోసం గాలింపు

పాకిస్థాన్ ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణులను సమర్థంగా ఎదుర్కొని వాటిని పేల్చేసిన భారత సైన్యం.. వాటి శకలాల కోసం ఆయా ప్రాంతాల్లో గాలింపు చర్యలను మొదలుపెట్టింది. పాక్ దాడులను రుజువు చేయడంలో భాగంగానే ఈ గాలింపు చర్యలు మొదలుపెట్టినట్టు ఆర్మీ వర్గాలు తెలిపాయి.

### పాక్ టార్గెట్ చేసిన నగరాలు ఇవే:

అవంతీపుర, శ్రీనగర్, జమ్ము, పఠాన్‌కోట్, అమృత్‌సర్, కపుర్తలా, జలంధర్, లూదియానా, అదామ్‌పుర్, భఠిండా, చండీగఢ్, నాల్, ఫలోడీ, ఉత్తర్‌లాయి, భుజ్.

## లోకం పోకడ




## • మళ్లీ సైన్యంలో చేరేందుకు సిద్ధం..



2002లో ఆర్మీ ఎయిర్ డిఫెన్స్‌లో చేరాను. జమ్మూకశ్మీర్‌లోని పలు ప్రాంతాల్లో 8 ఏండ్లు పనిచేసిన. పాకిస్థాన్ పెంచి పోషిస్తున్న ఉగ్రవాద మూకల చర్యలను ఎప్పటికప్పుడు సమర్థవంతంగా తిప్పికొట్టాం. 2019లో రిటైర్ అయ్యాను. ఇటీవల పహల్గాంలో ఉగ్రవాదుల దాడితో మనోవేదనకు గురయ్యా. ప్రస్తుతం ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం దాడులు చేస్తున్నది. సైన్యం నన్ను పిలిస్తే సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నా.

**-నాచోనియా భవాని, రిటైర్డ్ ఆర్మీ జవాన్, గంగాపూర్, మర్కూక్ మండలం, సిద్దిపేట జిల్లా**

## • పాకిస్థాన్‌కు ఓటమి తప్పదు



భారత్‌తో ఎప్పుడు పెట్టుకున్నా పాకిస్థాన్‌కు ఓటమి తప్పదు. మనం అన్ని రంగాల్లో బలంగా ఉన్నాం. మన ముందు పాకిస్థాన్ నిలబడలేదు. నేను 1980 నుంచి 1988 వరకు ఆర్మీలో పనిచేసిన. బార్డర్‌లో విధులు నిర్వహించే ప్రతి ఒక్కరూ అనుక్షణం అప్రమత్తంగా ఉంటారు. బార్డర్‌లో విధులు నిర్వహిస్తున్న క్రమంలో 1985లో కౌంటర్ అటాక్‌లో రెండు బుల్లెట్ గాయాలు కావడంతో ఉద్యోగం వీడాల్సి వచ్చింది. ఆర్మీలో చేరి బార్డర్‌లో విధులు నిర్వహించడం అంటే గర్వంగా ఉంటుంది.

**-దుగ్గెపోగు రాజేంద్రకుమార్, మాజీ సైనికుడు, రెబ్బెన, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా**

## • భారత్ దాడి సరైనదే..



ఆపరేషన్ సిందూర్ పేరిట పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత్ చేస్తున్న దాడి సరైందే. పాకిస్థాన్ కవ్వింపు చర్యలను చూస్తూ ఉపేక్షించేది లేదు. సైనికుడిగా పనిచేయాలనే కోరికతో నేను 2000 సంవత్సరంలో మిల్ట్రీలో చేరాను. 2007 వరకు పంజాబ్, జమ్మూకశ్మీర్‌లోని సరిహద్దుల్లో పనిచేశా. నిత్యం కూంబింగ్ జరిగేది. రోజూ పాకిస్థాన్ సైన్యం, ఉగ్రవాదులు కవ్వింపు చర్యలకు పాల్పడేవారు. జమ్మూకశ్మీర్‌లోని మచ్చల్ సెక్టార్ వద్ద జరిగిన కాల్పుల్లో నేను తీవ్రంగా గాయపడ్డా. హెలికాప్టర్‌లో దవాఖానకు తరలించారు. రెండు నెలలు చికిత్స పొంది మిల్ట్రీ నుంచి తిరిగి వచ్చేశా.

**-పల్లా వెంకటేశ్వర్లు, దామరచర్ల, నల్లగొండ జిల్లా**


## • భారత్‌ను పాక్ ఢీకొట్టలేదు



భారత్‌ను ఢీకొట్టే సత్తా పాకిస్థాన్‌కు లేదు. భారత సైన్యం అన్ని రంగాల్లో బలంగా ఉంది. ఎలాంటి పరిస్థితులు వచ్చినా ఎదుర్కొనే సత్తా మనకు ఉంది. 1998 ఆగస్టు 19న ఇండియన్ ఆర్మీలో సైనికుడిగా చేరా. 1999 కార్గిల్ వార్ పాల్గొన్నా. జమ్మూకశ్మీర్, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, హరియాణ, మహారాష్ట్ర, ఢిల్లీలో 18 ఏండ్లపాటు విధులు నిర్వహించా. కార్గిల్ యుద్ధ సమయంలో సరిహద్దుల్లోని డేంజర్ జోన్‌లో ఏర్పాటు చేసిన పికెట్‌లో ఒక కమాండర్ ఆధ్వర్యంలో ఆరుగురు సెంట్రీలం పోస్టు డ్యూటీ, పెట్రోలింగ్, క్యూఆర్టీ, ఆర్‌వోపీ, అంబూస్‌లో డ్యూటీ చేసే వాళ్లం. రాత్రీపగలు వంతెనలు, రహదారులను క్షుణ్ణంగా పరిశీలించేవాళ్లం. శత్రువులు మన భూభాగం వైపు రాకుండా అర్ధరాత్రి చీకట్లో కిరోసిన్ దీపాలు పట్టుకొని కాపలా కాసేవాళ్లం. గడ్డకట్టే మంచులో బుకారీ (ఇనుప డబ్బా)లో రైలు బొగ్గుకు మంట పెట్టి దాని వేడికి అక్కడ నిలబడి డ్యూటీ చేసేవాళ్లం.

**-కొమ్ము కోటేశ్, మాజీ సైనికుడు, అయిటిపాముల, కట్టంగూర్ మండలం, నల్లగొండ జిల్లా**

## • నాడే పాకిస్థాన్‌ను ఖతం చేసే వాళ్లం



రెండుసార్లు పాకిస్థాన్‌ను మట్టుబెట్టే దిశగా ముందుకు పోయామని, నాటి ప్రధానమంత్రుల ఆదేశాలతో వెనక్కి తగ్గాల్సి వచ్చిందని మాజీ సైనికుడు సంది పాపిరెడ్డి తెలిపారు. 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో పాపిరెడ్డి 'నమస్తే తెలంగాణ'తో తన అనుభవాలను పంచుకున్నారు. 1965లో ఎంతోమంది భారత సైనికులు ప్రాణాలు కోల్పోయినప్పటికీ ధైర్యంతో ముందుకు వెళ్లి లాహోర్ దగ్గరకు చేరుకున్నాం. కానీ అప్పటి ప్రధాని ఆదేశాలతో వెనక్కి తగ్గాం. ఆ ఒక్కరోజు ప్రధాని ఆదేశాలు రాకుంటే లాహోర్‌ను మట్టుబెట్టేవాళ్లం. 1971లో కూడా పాకిస్థాన్‌తో రెండోసారి యుద్ధం చేయాల్సి వచ్చింది. 19 రోజులపాటు వారితో యుద్ధం చేశాం. 99వేల మంది పాకిస్థాన్ సైన్యాన్ని గ్వాలియర్ వద్ద బంధించి తీసుకొచ్చాం. వారిని అప్పటి ప్రధాని ఇందిరాగాంధీకి అప్పగిస్తే మూడు నెలల తరువాత వారిని పంపించారు. అప్పుడే పాకిస్థాన్‌ను ఖతం చేస్తే ఇప్పుడు ఈ బాధలు ఉండేవి కాదు.

**-సంది పాపిరెడ్డి, మాజీ సైనికుడు**